నమస్తే తెలంగాణ
6
కరీంనగర్
శుక్రవారం 9 మే 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

## ప్రపంచం తలలూపింది


పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'పై దాదాపుగా ప్రపంచ దేశాలన్నీ సానుకూలంగా స్పందించాయి. దౌత్యపరమైన ప్రకటనల్లో ఎక్కడా భారత్ ప్రతీకార చర్యను వ్యతిరేకించకపోవడం గమనార్హం. 'ప్రపంచ వ్యవహారాల మీద ప్రభావం చూపే దేశాలన్నీ సంయమనం పాటించాలని' అన్నాయే తప్ప ఏ ఒక్క దేశమూ భారత్‌ను తప్పుబట్టలేదు. ఉగ్రవాదం విషయంలో రాజీ పడకూడదనే ధోరణి ప్రపంచవ్యాప్తంగా బలంగా నాటుకోవడమే ఇందుకు ప్రధాన కారణం. భూమ్మీద ఉన్న ప్రతీ దేశమూ ఏదోరకంగా ఉగ్రవాద పీడను అనుభవించి ఉండటమూ మరో కారణం. ప్రస్తుత స్పందనకు పహల్గాం దాడి తక్షణ కారణమైనప్పటికీ అదే మొదటిది కాదు. చివరిది కావాలనేది భారత్ ప్రగాఢమైన అభిమతం. పాకిస్థాన్ నుంచి సరిహద్దుల గుండా చొరబడే ఉగ్రమూకలు భారతదేశంలో అరాచక హింసాకాండకు పాల్పడటం దశాబ్దాలుగా సాగడం ప్రపంచం చూస్తూనే ఉన్నది. ముంబై దాడులు, ఉడీ ఉగ్ర ఘాతుకం, పఠాన్‌కోట్ అమానుషం.. ఒకటా రెండా.. అదొక వికట క్రీడగా, భారత్ పాలిట ఎడతెరిపి లేని పీడగా మారింది. ఆ ఉన్మాదం పహల్గాంలో నవ వధువుల సిందూరాన్ని రాల్చే కర్కోటక స్థాయికి చేరింది. 'శస్త్ర చికిత్స' తప్పని పరిస్థితి ఏర్పడింది. ఓపిక, సహనం పూర్తిగా అడుగంటిపోయి, ఉగ్రవాద విషవృక్షాన్ని సమూలంగా పెకిలించేందుకు భారత్ ప్రళయగర్జన చేసింది. 'అనివార్యం యుద్ధం శరసంధానమే ధర్మం' అంటూ అగ్ని వర్షంలో ఉగ్ర స్థావరాలను భస్మీపటలం చేసింది. ఇది ధర్మాగ్రహంతో కూడిన అత్యంత న్యాయమైన ప్రతిస్పందన. ఈ విషయంలో ప్రపంచ దేశాలకు రెండో అభిప్రాయం ఎలా ఉంటుంది?

ఇంతకూ పరిస్థితి ఇక్కడిదాకా ఎందుకు వచ్చింది? పాకిస్థాన్ ఉగ్రవాదుల ద్వారా సాగిస్తున్న పరోక్ష యుద్ధానికి ముగింపు ఎప్పుడు? పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నిర్దేశకత్వంలో భారత్‌లోకి చొచ్చుకువచ్చే ఉగ్రమూకల కిరాతకాలకు అంతం ఎప్పుడు? అంటే భారత్ 'ఇప్పుడు.. ఇప్పుడే' అని గర్జించింది. ఆగ్రహాగ్నిని వర్షించింది. అసలు పరిస్థితి ఇంతదాకా ఎందుకు వచ్చింది? అంతర్జాతీయ సమాజం పాకిస్థాన్ అనే బాధ్యతారహిత దేశం అనుసరిస్తున్న అమానవీయ విధానాలను సూటిగా, మడతపేచీ లేకుండా ఎప్పుడో ఎండగట్టి ఉండాల్సింది. బెత్తం పుచ్చుకొని అదుపు చేయాల్సింది. కానీ, అలా జరుగలేదు ఎందువల్ల? అస్పష్ట, సంక్లిష్ట గ్లోబల్ రాజకీయాల నీడలో పాక్ ఆటలు సాగాయి. పాక్ పుట్టుకే ఓ వికృతి. మత విభజన పేరిట జరిగిన ఓ అసహజ రాజ్యకల్పన. బ్రిటిష్ వలస పాలకులు అందుకు మంత్రసానులు. మతాన్ని జాతిగా మార్చిన విశ్వ రాజకీయ విషపూరిత ఎత్తుగడ అది. ప్రత్యేక దేశంగా ఆవిర్భవించిన నాటి నుంచి పాకిస్థాన్ భారత్‌పై విషం చిమ్ముతూనే ఉన్నది.

పాక్.. నాడు భారత్ ప్రహారంతో రెండు ముక్కలైన వికల రాజ్యం. అమెరికా ఆధిపత్య కాంక్షతో పెంచి పోషించిన ఓ ప్రాంతీయ కిరాయి సైనికుడు. దక్షిణాసియా గుండెలపై ఓ మానని గాయం. భారత్ వ్యతిరేకతతో నిలువెల్లా విషమయమైపోయిన దీర్ఘరోగి. చైనా కుటిల చదరంగంలో ఓ దిక్కుమాలిన పావు. పాక్ ఇవాళ ఓ కర్కోటక శక్తిగా మారడం వెనుక ప్రపంచ బాధ్యత ఉన్నది. కాదు కాదు, బాధ్యతారాహిత్యం ఉన్నదని చెప్పడం సబబుగా ఉంటుంది. ఇవాళ భారత్ తన వాదాన్ని బల్లగుద్ది మరీ వినిపిస్తున్నది. దుష్ట పన్నాగాల నికృష్ట పొరుగు పోరుపై శస్త్రాస్త్రాలు సంధిస్తుంటే ప్రపంచం తదేక దీక్షగా చూస్తున్నది. 'తథాస్తు' అని జేజేలు పలుకుతున్నది. 'జయోస్తు' అని తలలూపుతున్నది.

# పాక్ పథకంతోనే 'పహల్గాం'

'పహల్గాంలో 26 మంది పర్యాటకులను మతం పేరిట హతమార్చింది మేమే'నని ప్రకటించిన లష్కరే తోయిబా విషపుత్రిక 'టీఆర్ఎఫ్'ను, వారి రాక్షసత్వాన్ని భారతీయులు ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదులను పెంచి పోషించిన పాకిస్థాన్‌ను తిట్టి, శాపనార్థాలు పెట్టారు. ఉగ్రమూకలను పట్టి హతమార్చటానికి, పాక్‌ను కట్టడి చేయడానికి భారత ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టినా మేం సహకరిస్తామని ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రధాని మోదీకి మద్దతు ప్రకటించాయి.



పాతూరి వేంకటేశ్వర్‌రావు
98490 81889



కొందరు ముస్లిం బాలబాలికలు కొన్నేండ్లుగా తాము దాచుకున్న కిడ్డీ బ్యాంకు ధనాన్ని, ఉగ్రవాదులను ఖతం చేసేటందుకు ప్రధాని మోదీకి పంపిస్తామని ముందుకురావటం అభినందనీయం. ఈ నేపథ్యంలో భారతీయ ముస్లింలు ముక్తకంఠంతో ఉగ్రదాడిని ఖండిస్తూ, పాక్‌ను నిరసిస్తూ, భారత ప్రభుత్వానికి మద్దతు ప్రకటించటం శుభ పరిణామం.

పర్యాటకులను కాపాడేందుకు ఉగ్రమూకలకు ఎదురునిలిచి తన ప్రాణాలర్పించిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా తండ్రి ముహమ్మద్ 'పర్యాటకుల కోసం ప్రాణాలర్పించిన నా కుమారుడు నాకు గర్వకారణం' అన్నారు. పై ఘటనలు సిసలైన భారతీయతకు, కశ్మీరియతకు ప్రతీకలు. అంతేకాదు, కశ్మీరీ ముస్లిం యువకులు గాయపడిన పర్యాటకులను భుజాలపై మోసుకెళ్లి వైద్యం చేయించారు. తమ తమ టాక్సీలలో హాస్పిటల్స్‌కు ఫ్రీగా తీసుకువెళ్లారు, విమానాశ్రయాలకు చేర్పించారు. భయాందోళనలో వణికిపోతున్న పర్యాటకులకు మసీదులలో ఆశ్రయమిచ్చి, సేవలందించిన కశ్మీరీ ముస్లిం మతాచార్యులు తమ తమ గృహాలతో ఆశ్రయమిచ్చి సేదదీర్చారు. పర్యాటకులను ఆత్మీయంగా సాగనంపిన కశ్మీరీ ముస్లిం కుటుంబీకులు, సమస్త భారతీయులకు ఆదర్శనీయులే! అందుకే, పర్యాటకులు, భారతీయులందరి తరపున వారికి నా కృతజ్ఞతాభివందనాలు. హేట్సాఫ్ కశ్మీర్ ముస్లిం సహోదరీ సహోదరులారా హేట్సాఫ్.

పాకిస్థాన్ ఉగ్రవాదులను కశ్మీర్‌పైకి ఎగదోయడానికి ముఖ్య కారణమేమిటో తెలుసుకుందాం. కొందరు రాజకీయ నాయకులు రౌడీలు, గూండాలను పోషిస్తున్నట్టే, పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందన్నది జగమెరిగిన సత్యం. పాక్‌తో పలు ముఠాలుగా పెరుగుతున్న ఉగ్ర బృందాలను వివిధ కంప్యూటర్లతో పోల్చితే, వాటన్నింటికీ సర్వర్ పాక్ 'ఐఎస్ఐ' అన్నదీ జగద్విదితమే. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజ్ ఆసిఫ్ 'స్కైన్యూస్'తో మాట్లాడుతూ... 'అమెరికా, పశ్చిమదేశాల కోసం ఉగ్రవాదులను పోషించే చెత్త పనిని నెత్తికెత్తుకున్నామ'ంటూ తమ తప్పును అంగీకరించారు. అలాగే పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్, పాక్ ప్రవాసీ వ్యాపారవేత్తల సభలో మాట్లాడుతూ.. 'హిందువులు వేరు, ముస్లింలు వేరు' మనది ముస్లిం జాతి, హిందువులతో మనకు కుదరని పని. ఈ 'ద్విజాతి సిద్ధాంతం'తోనే అవతరించింది మన పాకిస్థాన్. ఈ ద్విజాతి సిద్ధాంతాన్ని మీ పిల్లలకూ ప్రబోధించండి! మీరు విస్మరించకండి' అంటూ పసి హృదయాలలో కూడా మత విద్వేష బీజాలను నాటమని ప్రబోధించాడు. అంతేకాదు, 'కశ్మీర్ సమస్యనూ మనమెప్పటికీ వదులుకోకూడదు. ఎందుకంటే కశ్మీర్ మన కంఠనాళం' అని కూడా వక్కాణించాడు.

దాన్నంతగా ఎందుకు నొక్కి చెప్పాడంటే.. పాక్ ప్రజల్లో ఆగ్రహజ్వాలలు ప్రజ్వరిల్లినప్పుడల్లా, వాళ్ల దృష్టిని భారత్ వైపు మళ్లించాలి. అందుకు పాక్ పాలకులకున్న ఏకైక సాకు కశ్మీరే! ఎందుకంటే పాకిస్థాన్ ఒక విఫల ప్రజాస్వామ్య దేశం! పాక్ మత పెద్దలు, సైనికాధికారుల చేతి రిమోటే పాక్ ప్రధాని.

భారతదేశంలో అత్యధిక సంపద కొందరు కార్పొరేట్ల వద్ద పోగుపడినట్టే పాకిస్థాన్‌లోని అత్యధిక సంపద కొందరు మత పెద్దలు, సైనికాధికారుల వద్ద పోగుపడింది. దాన్ని కాపాడుకోవడానికి, మరింత పెంచుకోవడానికి వాళ్లు చేస్తున్న స్వార్థ రాజకీయాల కారణంగా పాకిస్థాన్ నేడు రాజకీయ, ఆర్థిక సంక్షోభాలలో కొట్టుమిట్టాడుతున్నది. ఆకలితో, ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నది. ఐనా సరే పాక్ ప్రజలు తిరగపడకుండా 'ధనబలం + సైనిక బలం + మతోన్మాదం'తో ముప్పేట బిగింపులతో అణచివేస్తున్నారు. వాళ్ల దోపిడీని, అణచివేతనూ సహించలేకనే నాడు పాక్ నుంచి 'బంగ్లాదేశ్' విడిపోయింది. నేడు బలూచిస్థాన్ అందుకు సిద్ధంగా ఉన్నది. ఈ విషమ పరిస్థితుల్లో పాక్ ప్రజల ఆగ్రహాన్ని భారత్ వైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అలా 'పాక్ పాలకుల డైవర్షన్ పాలిటిక్స్'లో భాగమే 'పహల్గాం' హత్యాకాండ అన్నది వాస్తవం.

**పర్యాటకులను ఇలా మతం పేరిట హత్య చేయించుట ద్వారా పాక్ పాలకులు సాధించ దలచుకున్న లక్ష్యాలివే..**

1.పాక్ ప్రజల ఆగ్రహావేశాలను తమ మీది నుంచి భారత్ వైపు మళ్లించటం. 2.హిందువులనే హత్య చేయించటం ద్వారా భారతీయ హిందువుల్లో కశ్మీరీ ముస్లింల పట్ల విద్వేషాన్ని రగిలించటం. తత్కారణంగా ముస్లిం దేశమైన పాక్‌తో కలిసి ఉండటమే శ్రేయస్కరం అన్న భావనను కశ్మీరీ ముస్లింలలో రేకెత్తించటం. 3. పర్యాటకులను హతమార్చటం ద్వారా కశ్మీర్ రావటానికే భయాన్ని రేకెత్తించటం, పర్యాటకరంగమే జీవనాధారంగా ఉన్న కశ్మీర్ ముస్లింల ఉపాధికి గండి కొట్టి, వాళ్లను భారత్‌పై తిరగబడేలా చేయటం. 4. ఈ మతపర హత్యాకాండల ద్వారా భారత్‌లోని మత విద్వేషాలకు ఆజ్యం పోసి భారత జాతీయ సమైక్యతకు గండి కొట్టడం ద్వారా, భారత్‌ను బలహీన పరచటం. 5.అమెరికా ఉపాధ్యక్షుడు భారత్‌లో పర్యటిస్తున్నప్పుడే, భారత్‌పై తెగబడటం ద్వారా అంతర్జాతీయంగా తమ శక్తి సామర్థ్యాలను చాటుకోడటం-మేమేం చేసినా అమెరికా మా జోలికి రాదు, ఎందుకంటే, దానికి మాతో అవసరం ఉంది గనుక! అన్న సంకేతాన్ని భారత పాలకులకు అందజేయటం, ఇవీ, పాక్ పాలకుల లక్ష్యాలు!

పాక్ ఆర్మీ చీఫ్ 'కశ్మీర్ సమస్యను మేం ఎప్పటికీ వదులుకోమని ప్రకటించిన వారంలోపే జరిగింది పహల్గాంలో ఉగ్రదాడి. కాబట్టి ఇది యాదృచ్ఛికం కాదు, పాక్ పాలకులు ముమ్మాటికీ ప్రణాళికాబద్ధంగా చేయించిన హత్యాకాండనే.



## సిందూరానికి వీర వందనం

సిందూర రేఖ రక్తసాక్షిగా వెలిగింది,
ధీరుల నడకకు భూదేవి పులకించింది.
సరిహద్దు గాలి పటాకుల్లా మోగింది.

అమ్మ కడుపు కన్నీటి తడిగా మారినా...
ఆ వీరుని నడక ఒక్క అడుగు తగ్గలేదు.
తండ్రి ఆశల పూదోట ముసురు పడినా..
తల్లి తొలి ముద్దు త్యాగమై నిలిచే... జై హిందని.

నల్ల చీకటిలో దీపాలై వెలిగిన వీరులు,
వారి నీడలో ఓ వెలుగు చూసింది దేశం.
జీవితాన్ని పణంగా పెట్టి నిలిచి ధైర్యం,
ఆ ధైర్యంలో జాతీయ గీతమై పులకించింది దేశం.

ఒక్క జెండా కోసం శ్వాసను ధర్మంగా చేశారు,
వారిని చూసి గగనమే గర్వంతో వంగింది.
కన్నీటి వెనుక జ్వాలగా రగిలిన ఆ శక్తి,
పరాక్రమమై మన దేశానికి కవచంలా నిలిచింది.

చలికి చెమట,
మృతికి ఎదురుగా చిరునవ్వు,
అన్నీ వదిలి, దేశ జెండాను పట్టిన త్యాగధనులు,
పోరాడినది ఓ సరిహద్దు కోసం కాదు,
దేశ భవిష్యత్తు కోసం.

సిందూరమై మురిసిన భువిపై,
ఒక్కో క్షణం ధైర్యానికే సాక్ష్యం.
వీరుల రక్తంతో రాసిన చరిత్రలా..
ప్రతి గుండెలో సజీవమై ఉండే..
ఆపరేషన్ సిందూరానికి.. వీర వందనం.



నసుబోలు రాజశేఖర్
9885739808

# ప్రజల ఐక్యతే దేశానికి రక్ష



పతకమూరు దామోదర్ ప్రసాద్
94409 90381

**పాకిస్థాన్ ప్రేరేపిత జీహాదీ ఉగ్ర మూకలు పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపడంపై దేశమంతటా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. 370వ అధికరణం రద్దు తర్వాత ఇతర రాష్ర్టాల ప్రజలు కశ్మీర్ పర్యటనకు వస్తూ అక్కడి ప్రజలతో మమేకం కావడాన్ని జీర్ణించుకోలేని ఇస్లామిక్ మతఛాందస జీహాదీ శక్తులు పథకం ప్రకారం పర్యాటకులను కాల్చిచంపడం కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే. ఈ దుర్మార్గపు చర్యతో భారత్‌లో మళ్లీ హిందూముస్లిం మత విభజన తేవడం పాక్ సైనిక పాలకుల పన్నాగం. 77 ఏండ్ల కిందట భారత్, పాకిస్థాన్లుగా విడిపోయినా పాక్ పలుమార్లు మత విద్వేష విషం కక్కుతూ యుద్ధాలకు, దురాక్రమణలకు పూనుకున్న దృష్టాంతాలెన్నో.**

భారత్‌ను గుడ్డిగా ద్వేషించే పాక్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఆసిఫ్ మునీర్ పహల్గాం మారణకాండకు కారకుడని రూఢీగా తెలుస్తున్నది. పాక్‌లో పేరుకే ప్రజాస్వామ్యం. అయితే నిజమైన అధికారం చెలాయిస్తున్నది పాక్ ప్రధాన దండనాయకులేనని తెలిసిందే. పాక్ ఏర్పడిన 77 ఏండ్లలో 3 దశలలో 33 ఏండ్ల పాటు వీరే ప్రభుత్వాలను కూలదోసి, పాలనా యంత్రాంగంపై పట్టు బిగించి నిరంకుశ రాజ్యం చెలాయించింది. మిగతా సంవత్సరాలలో పేరుకే పౌర ప్రభుత్వాలే కానీ, అంతిమ అధికారం సైన్యం గుప్పిట్లోనే ఉంది. ఎవరైనా ధిక్కరిస్తే వారి గతి అంతే.

మునుపటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తన ప్రభుత్వ నిర్ణయాలే అంతిమం అని గట్టిగా నిలిస్తే 2022లో కుట్ర ద్వారా ఇమ్రాన్ ప్రభుత్వాన్ని కూల్చి, ప్రత్యర్థులైన నవాజ్ షరీఫ్ ముస్లిం లీగ్, పాక్ పీపుల్స్ పార్టీ నేత బిలావల్ భుట్టోలతో కొత్త కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో సైన్యాధ్యక్షుడు ఆసిఫ్ మునీర్ కీలక పాత్ర పోషించాడు. ఇమ్రాన్‌ఖాన్ బహుళ జనాదరణ కలిగిన నేత. కానీ ఆసిఫ్ మునీర్ పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ, సైనిక నిఘా విభాగం రెండింటికీ డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తూ తిరుగులేని శక్తిగా ఎదిగాడు. ఇమ్రాన్ ఖాన్ సతీమణి బుష్రా బీబీ అక్రమంగా డబ్బు, వజ్రాలు, స్వర్ణాభరణాలు సంపాదించిన చేదు నిజం ప్రధాని దృష్టికి తేవడంతో ఆగ్రహించిన ఇమ్రాన్‌ఖాన్ మునీర్‌ను పదవి నుంచి తొలగించడంతో ఇరువురి మధ్య ప్రత్యక్ష ఘర్షణ ఆరంభమైంది. ఖురాన్‌ను కంఠస్థం చేసిన మునీర్ దేశంలో మత రాజకీయాలను ఎగదోయడం ప్రారంభించారు. ఈ విషయంలో ఇస్లామిక్ సైన్యాధ్యక్షుడిగా ఉండిన జనరల్ జియావుల్ హక్ మునీర్‌కు స్ఫూర్తి. పాకిస్థాన్ ఇప్పటికే అనేక రంగాల్లో తీవ్ర ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటూ, దివాలా స్థితిలో ఉన్నది. ఈ దుస్థితి నుంచి పాక్ ప్రజల దృష్టిని మళ్లించడానికే జనరల్ మునీర్ పహల్గాంలో లష్కరే తోయిబా జీహాదీ తీవ్ర వాదులను అమాయక విహార యాత్రికులపై దాడికి ఉసిగొల్పి భీతావహ పరిస్థితి సృష్టించారని తెలుస్తున్నది. ద్విజాతి సిద్ధాంతాన్ని నెత్తికెత్తుకొని హిందువులు-ముస్లింలు ఎప్పటికీ ఏకీకరణం కాలేరనే దుర్మార్గ వాదన వినిపిస్తూ భారత్‌లో విద్వేషాలు రెచ్చగొట్టే పథకం వేశారు. మతాన్ని, రాజకీయాలను మత ఉగ్రవాదాన్ని జోడించి ఎన్నటికీ సయోధ్య కుదరని స్థితికి తెచ్చారు.




మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్టుపై పాక్ సైన్యంలో విభేదాలున్నా అసమ్మతిని మునీర్ కఠినంగా అణచివేశాడు. దేశ విభజన జరిగినప్పుడు మునీర్ తండ్రి టీచర్. సయ్యద్ సర్వర్ పాక్‌కు వచ్చి రావల్పిండిలో స్థిరపడ్డారు. అక్కడి మదర్సాలో మునీర్ చదివాడు. ఆ తర్వాత పాక్ మిలిటరీ అకాడమీలో శిక్షణ పొంది ఫ్రాంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో అధికారి అయ్యాడు. కుట్ర ద్వారా ఇమ్రాన్ ఖాన్‌ను గద్దె దించాక, షాబాజ్, నవాజ్ షరీఫ్ సోదరులు పాక్ సైన్యాధ్యక్షుడిగా మునీర్‌ను ఆమోదిస్తూ సంతకం చేయక తప్పలేదు. జనరల్ మునీర్ ఈ ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయాల్సి ఉన్నా త్రివిధ దళాల అధిపతుల పదవీకాలాన్ని మూడు నుంచి ఐదేండ్లకు పెంచుతూ పార్లమెంటు తీర్మానించడంతో 2027 వరకు మునీర్ కొనసాగడం ఖరారైంది.

ప్రస్తుతం పాకిస్థాన్‌లో అంతర్గత అసమ్మతి, ఉగ్రవాద శక్తులు చెలరేగిపోవడంతో, తీవ్ర ఆర్థిక దుస్థితి నెలకొన్నది. ప్రజలు కొనుగోలు శక్తి క్షీణించి దివాలా స్థితిలో ఉన్నా, పాక్ పాలకులు జీహాదీ మత భావనలు ప్రేరేపించి కశ్మీర్‌లో భారత్‌పై దాడులకు కుట్రలు కుతంత్రాలు పన్నుతూనే ఉన్నారు. పహల్గాంలో కొందరు జిహాదీ ఉగ్రవాదుల మారణకాండ తర్వాత భారత ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది.

**పహల్గాం మారణకాండ జరిగినప్పుడు కశ్మీర్ పౌరులు అపూర్వంగా స్పందించి యాత్రికులకు ఆశ్రయం, రక్షణ కల్పించి ఆదుకోవడం ప్రశంసనీయం. మతోద్రిక్తతలు రెచ్చగొట్టే కుతంత్రాల ప్రభావానికి లొంగకుండా మానవీయ దృష్టిలో స్పందించి కులం, మతం, ప్రాంతం ఏవైనా తామంతా భారతీయులమని చాటారు.**

ఈ పరిస్థితుల్లో దేశరక్షణ, ప్రాదేశిక సమగ్రత, సమైక్యత, ప్రజల్లో దేశభక్తి భావనలు పెంపొందించాలి. ముఖ్యంగా ప్రజల్లో మత విద్వేష భావనలు రెచ్చగొట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు ప్రభుత్వాలు సన్నద్ధం కావాలి. ప్రజల ఐక్యతే దేశ రక్షణకు శ్రీరామరక్ష.




## ఎప్పుడు అర్థమవుతుందో?



ప్రపంచంలో ఏ మూడేండ్ల పిల్లాడినైనా వంచక దేశమేదని అడిగితే అది పాకిస్థాన్ అని వెంటనే బదులిస్తాడు. లాడెన్ మొదలుకొని మసూద్ అజార్, దావూద్ వరకు; జైషే ముహమ్మద్ మొదలుకొని దాని అనుబంధ సంస్థల వరకు అన్నీ పాక్ భూ భాగంలోనే కనిపిస్తాయి. ఇక చట్టబద్ధ పాలన గురించి మాట్లాడుకొంటే.. నియమాల ఆధారంగా నడిచే ప్రపంచాన్ని వంచకులు ఎప్పుడు అర్థం చేసుకొంటారు?

**- ప్రియాంక చతుర్వేది, శివసేన ఎంపీ**



## యుద్ధ'నానీ'లు

చంపడం
మా ఉద్దేశ్యం కాదు
కానీ
ప్రతీకారం తీర్చుకోవడం మా కర్తవ్యం.

నుదిటిన
సిందూరం నువ్వు తుడిచేస్తేనేం
వీరుల
రక్తంతో వీరతిలకం దిద్దుతాము.

భారతం
నేర్పలేదా?
స్త్రీ తలచుకుంటే
మరో కురుక్షేత్రమని.

సైనికా
రక్తం చిందిందని బాధపడకు
అదే
భరతమాతకు సిందూరం.

ప్రత్యక్షంగా
పోరాడు
మా వీరుల
ప్రతాపం ఏమిటో తెలుస్తుంది.

ఎంత కాలం
దొంగ దెబ్బ తీస్తావు?
మా ఎదురుదెబ్బ
రుచి చూడు.

ఆయుధం
ఉందని విర్రవీగకు
నీ ఆయుధం
పవిత్ర యుద్ధం చేయలేదు.

వెంట్రుక వాసిలో
ప్రమాదం తప్పిందనా?
తప్పించింది
మేమే.

మీరు
మనుషులు అయితే
మతం పేరిట
మారణకాండ సృష్టించరు.

తల్లికి
బిడ్డలంటే ఎంత ప్రేమో
భరత మాతకు
వీర సైనికులు కూడా అంతే.

వీరులపై
మీ ప్రతాపం క్షమిస్తాం
సామాన్యులపై మీ ప్రతాపం
తల తీస్తాం.

సామాన్యుల
మీదకు గన్‌లు ఎత్తకు
నీ బుల్లెట్లకు
చింతకాయలు రాలవు.

ఒకసారి హింసిస్తే
సరే
మళ్ళీ మళ్ళీ
తప్పదు తప్పు లేదు ఈ సిందూరం

పవిత్ర యుద్ధం పేరుతో
మోసమా!
అయితే కాచుకో
మా కురుక్షేత్ర యుద్ధం.

దేవుడు ఉన్నాడు అనడం
తప్పా?
మరి
మీ దేవుడెందుకు మాకు.



కర్నె మల్లికార్జున్
63037 44239





## ఇంటికొక సైనికుడు..

పిడికిలెత్తి గొంతెత్తి
ఉద్రేక దేశభక్తి ఉపన్యాసాలకేం తక్కువ లేదు
పేజీలకు పేజీలే!
గంటలు గంటలే!

అందరూ పిల్లల్ని కంటారు
తమ సంతానంలో ఒకరైన సైనికుడిగా
దేశానికి అంకితమైతేనే
అది గొప్ప కుటుంబం
సార్థక వంశం!

భవిష్యత్తులోనైనా మన దేశంలో
ప్రతి కుటుంబం సైనిక కుటుంబమైతే
ప్రపంచానికే మార్గదర్శనం!
శత్రు దేశాలు కన్నెత్తి చూడలేవు
సరిహద్దు గీత దాటి రాలేవు...



కందాళై రాఘవాచార్య
87905 93638